
శ్రీ కళ్యాణ కనకదుర్గ అమ్మవారి స్తోత్రమాల

భావార్థములతో

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/


శ్రీ మల్లేశ్వరస్వామి

కళ్యాణ కనకదుర్గ అమ్మవారి స్తోత్రమాల



బాల:

బాల పర్వతవర్ధనీ భగవతీ బాలార్క కోటి ప్రభా।
కల్యాణీ నిఖిలేశ్వరీ శుభకరీ గౌరీ శివా పార్వతీ।
సర్వజ్ఞా సకలాగమాంత వినుతా సౌభాగ్య సంపత్ప్రదా।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

పర్వతరాజైన హిమవంతుని ప్రభావమును వృద్ధిపొందించునదియును, పరమైశ్వర్యసంపన్నయును, ఉదయించుచున్న కోటి సూర్యులకాంతి కలదియును, జగత్కల్యాణ స్వరూపిణియును, సకల లోకాధీశ్వరియును భక్తులకు సమస్త శుభములు సమకూర్చునదియును, మంగళగౌరీదేవియును, శుభప్రదయును, హైమవతియును, సకల కలావేదినియును, నానావిధములైన ఉపనిషత్తులచే ఉపాసింపబడునదియును, సౌభాగ్య సంపత్కారిణియును, నవకోటిరూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **"బాల"** నన్ను రక్షించుగాక!

లలిత:



శ్రీ మాతా లలితా ప్రసన్నవదనా శ్రీ రాజరాజేశ్వరీ।
విష్ణు బ్రహ్మ మహేంద్రసేవితపదా విశ్వేశ్వరీ శాంభవీ।
కారుణ్యామృతవాహినీ రసమయీ కైవల్య సంధాయినీ।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

అఖిలాండకోటి బ్రహ్మాండజనయిత్రియు, సర్వదా సుప్రసన్న సుందర ముఖారవిందయు, శ్రీ రాజరాజేశ్వరీ స్వరూపిణియు, మహావిష్ణువు, బ్రహ్మదేవుడు, దేవేంద్రుడు భావించి సేవించు పావనపాద రాజీవములు కలదియు, సమస్త ప్రపంచమున కధీశ్వరియు, విశ్వవ్యాపినియు, కరుణారసము నిండి జాలువాఱు అమృత స్రవంతియు, బ్రహానంద స్వరూపిణియు, పునరావృత్తి రహిత మోక్షాధి కారణియు, నవకోటి రూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **"లలితామాత"** నన్ను రక్షించుగాక!

అన్నపూర్ణ:



హ్రీంకారీ త్రిపురేశ్వరీ సుఖకరీ మాతాన్నపూర్ణేశ్వరీ।
ఈశానీ నవరత్న నూపురయుతా హేమాంబరోద్భాసినీ।
శ్యామా హైమవతీ సతీ గుణవతీ శ్రీ చక్ర సంచారిణీ।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

హ్రీంకారమంత్ర స్వరూపిణియు, త్రిపురసుందరియు, సుఖ ప్రదాయినియు, అన్ని లోకములకు కన్నతల్లియు, విశ్వమున కధీశ్వరియు, నవరత్నఖచిత నూపురములతో నలంకృతమైన చరణ కమలములు కలదియు, కనకచేలముతో మిక్కిలి ప్రకాశించునదియు, సుకుమారమైన సుందరరూపము కలదియు, హిమవంతుని ముద్దుల బిడ్డయు, పతివ్రతలకు మేలు బంతియు, సకల సద్గుణ నిధానమును, శ్రీ చక్ర సంచారిణియు, నవకోటి రూప ధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత "**అన్నపూర్ణేశ్వరి దేవి**" నన్ను రక్షించుగాక!

అశ్వారూఢ:



అశ్వారూఢ విహారిణీ విజయినీ కేయూర హారోజ్జ్వలా।
శర్వాణీ శశి సూర్యవహ్ని నయనా, సౌభాగ్య సంజీవినీ।
దేవీ జ్ఞానమయీ చరాచరమయీ తేజోమయీ చిన్మయీ।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

విజయశ్రీ విరాజమానయు, హారకేయూరాది సువర్ణాభరణ దేదీప్యమానయు, అర్ధేందుధరుని అర్ధాంగలక్ష్మియు, చంద్ర సూర్యాగ్ని లోచనయు, పుణ్యవతుల సౌభాగ్యమునకు సంజీవనియు, ఆది దేవియు, జ్ఞానేశ్వరియు, చరాచర జగన్మూర్తియు, తేజోవిరాజితయు, చిన్మయాకారిణియు, నవకోటిరూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **"అశ్వారూఢ"** నన్ను రక్షించుగాక!

రాజమాతంగి:



మాతంగీ శుకలాలినీ మధుమతీ మాణిక్య వీణాధరీ।
మహేంద్రాశ్య సమాన కాంతికలితా వాగ్దేవితా సేవితా।
తారానాథ కలాకలాప మకుటా సంగీత సమ్మోదితా।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

శ్రుతిస్వరూపమైన శుకమును లాలించునదియు, మధురసానందమయ స్వరూపిణియు, మాణిక్యవీణాపాణియు, ఇంద్రనీల మణి మంజులమైన దేహకాంతి కలిగినదియు, సుందర దరహాసభాసుర వదనారవిందయు, వాగ్దేవిచే సేవలందుకొనునదియు, చంద్రకళా కలాప కలిత కాంచన కిరీటియు, కమనీయ గాంధర్వగాన కౌతుకమతియు, నవకోటిరూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **“రాజమాతంగి”** నన్ను రక్షించుగాక!

వాగ్వాదిని:



వాత్సల్యామృతవర్షిణీ గుణమణీ వాగ్వాదినీ హ్లాదినీ।
శబ్దబ్రహ్మమయీ త్రిలోకజననీ సౌందర్య మందాకినీ।
రాకాచంద్ర సహస్ర చారువదనా రాజీవమధ్యస్థితా।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

భక్తులపై వాత్సల్యరూపమైన అమృతవర్షము, కురిపించునదియు, గుణాలంకృతయు, హ్లాదస్వరూపిణియు, శబ్దబ్రహ్మమూర్తియు, ముల్లోకముల రక్షించు చల్లనితల్లియు, సహజసౌందర్య తరంగములు పొంగిపొరలు గగనగంగ వంటిదియు, సహస్ర రాకా చంద్ర సదృశవదన ప్రభావిభాసమానయు, వికచకమల విహారిణియు, నవకోటిరూప ధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **"వాగ్వాదిని"** నన్ను రక్షించుగాక!

వారాహి:



వారాహీ వరదాయినీ సురనుతావైడూర్య భూషాంచితా।
శ్రీ విద్యా విజయా జయా గిరిసుతా క్షేమంకరీ శాంకరీ।
హేమభా ప్రియదర్శనా సునయనా కామేశ్వరీ భైరవీ।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

ఆశ్రితవరప్రదాత్రియు, ముక్కోటిదేవతల మ్రొక్కులందుకొను చక్కని తల్లియు, నవరత్నాలంకార సమలంకృత తనూవల్లియు, శ్రీ విద్యాస్వరూపిణియు, విజయదాత్రియు, జయవిధాత్రియు పర్వతరాజ పుత్రియు, సకలలోక క్షేమంకరియు, సర్వమంగళయు, సువర్ణవర్ణ భాసమానయు, ప్రియదర్శనయు, సుందర లోచనయు, కోరిన కోర్కెల ప్రసాదించు పరమేశ్వరియు, క్రూర దైత్యసంహారిణియు, నవకోటిరూప ధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత "**వారాహి**" నన్ను రక్షించుగాక!

పరాశక్తి:



కల్యాణైక పరంపరా సుమధురా కాళీ భవానీ పరా।
పశ్యంతీ ప్రియవైఖరీ శశికళా శ్రీ మంజులా మధ్యమా।
కామాక్షీ కరుణా కటాక్ష లహరీ కాత్యాయనీ భారతీ।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

కల్యాణ పరంపరలు కటాక్షించునదియు, మధుర మంజుల కలభాషిణియు, మహాకాళియు, మహాభవానియు, పరా - పశ్యంతీ - వైఖరీ - మధ్యమా - స్వరూపిణియు, పరమేశ్వరియు, చంద్రకళాకిరీటియు, కామాక్షిదేవియు, కడకన్నులయందు కరుణారసము జాల్వారు కాత్యాయనియు, వాక్ప్రసారిణియు, నవకోటిరూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **"పరాశక్తి"** నన్ను రక్షించుగాక!

భువనేశ్వరి:



కౌమారీ భువనేశ్వరీ శుభకరీ సర్వార్థ సంపత్కరీ।
పంచక్రోశ పరీత పూత విజయ శ్రీ వాటికాధీశ్వరీ।
రంగన్మంగళ కృష్ణవేణి తటినీ తీరే సదా సంస్థితా।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

నిత్యకౌమారియు, నిత్య శుభంకరియు, సర్వార్థ సంపత్ప్రదాత్రియు, పంచక్రోశ పరీతమై ప్రపూతమైన విజయవాటికా క్షేత్రమున కధీశ్వరియు, ఉత్తుంగ తరంగములతో మ్రోగు మంగళ స్వరూపిణియు, కృష్ణవేణీ తరంగిణీ తీరమున నెలకొనియున్న నిత్య కల్యాణియు, మహాదేవ సహధర్మచారిణియు, నవకోటిరూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత "**భువనేశ్వరి**" నన్ను రక్షించుగాక!

చండి:



చండీ చండ నిషుదినీ సువదనా సింహేంద్ర సంచారిణీ।
దీవ్యచ్ఛంద్ర కిరీటినీ త్రిణయనా దేవీ శుభాకారిణీ।
చంచచ్చక్ర గదాసి కార్ముక కరా ధూమ్రాక్ష సంహారిణీ।
దుర్గాంబా నవకోటిమూర్తి సహితా మాంపాతు మాహేశ్వరీ॥

జగత్కంటకుడైన చండుడను రాక్షసుని ఖండించినదియు, ప్రశాంత సుందరమైన వదనారవిందము కలదియు, సింహేంద్ర వాహనారూఢయు, కిరీటమునందు చంద్రకళ వెలుగు లీనుచున్నదియు, నేత్రత్రయ విరాజితయు, ఆదిదేవియు, త్రిభువన మంగళ ప్రదమైన స్వరూపము కలదియు, దేదీప్యమానములైన చక్రము, గద, ధనుస్సులను హస్తమునందు ధరించునదియు, ధూమ్రాక్ష గర్వాపహారిణియు, నవకోటిరూపధారిణియునైన మహేశ్వరి మహాదుర్గ జగన్మాత **"చండీమాత"** నన్ను రక్షించుగాక!

ఫలశ్రుతి:

దుర్గాస్తోత్ర మిదం పుణ్యం సర్వ సౌభాగ్య వర్ధనమ్।
యః పఠేత్ పురోషో భక్త్యా సంప్రాప్నోతి సదా శ్రియమ్॥

ఇది దుర్గాదేవా స్తోత్రము, పరమ పవిత్రము, సమస్త సౌభాగ్య సంపత్ప్రదము. ఈ స్తోత్రము భక్తితో పఠించినవారు సర్వదా సకల విధములైన సన్మంగళములను పొందుదురు.

శ్రీ మల్లేశ్వర స్తుతి:

బ్రహ్మాచ్యుతాది సురమౌళి కిరీటరత్న
కోటీర చుంబిత పవిత్ర పదారవిందం।
దుర్గా మనోహర మపార కృపాపయోధిం
మల్లేశ్వరం శశివతంస మహం నమామి॥

క్షేత్ర పాలక స్తుతి:

మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరేణ్యమ్।
వాతాత్మజం వానరయూధ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి॥.

-x-x-x-x-x-x-x-



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)